నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, ఆదివారం 2 మార్చి 2025 | KAMAREDDY

రంజాన్ వేళలు
ఆదివారం ఇఫ్తార్ : 6-31 | సోమవారం సహర్ : 5-23

ఎయిర్‌పోర్టు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)



విమానయానం ఉమ్మడి జిల్లా ప్రజలకు కలాగానే మిగలనుందా..? కేంద్ర సర్కారు జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు విషయాన్ని పట్టించుకోవడం లేదా..? అంటే అవుననే అను మానాలు వ్యక్తం అవుతున్నాయి. వరంగల్‌లోని మామునూర్ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి ఆమోదం తెలుపుతూ కేంద్ర పౌర విమానయాన శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ జిల్లావాసుల గగన విహార కలను త్వరలోనే సాకారం చేసేం దుకు అడుగులు పడుతున్నాయి. ఇన్ని రోజులు అడ్డంకిగా భావిస్తూ వచ్చిన 150 కిలో మీటర్ల నిబంధనను జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ సడలించ డంతో కేంద్రం కూడా అందుకు అంగీకారం తెలిపింది. ఇదే సమ యంలో నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు అభివృద్ధిపై సర్వత్రా ఆసక్తి ఏర్పడింది.

–నిజామాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

మనకేది?

ముందడుగు పడని జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు

వరంగల్ విమానాశ్రయానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టును పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం

బీఆర్ఎస్ సర్కారు హయాంలో తీవ్ర ప్రయత్నాలు

దశాబ్దాలుగా ఆశతో ఎదురు చూస్తున్న ఉమ్మడి జిల్లా ప్రజలు

బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని జిల్లావాసుల విజ్ఞప్తి

తెలంగాణలో హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌లో ఎయిర్‌పోర్టు ఎంత అవసరమో... ఉత్తర తెలంగాణకు గుండె కాయలాంటి నిజామా బాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం ఆవశ్యకత ఎంతో ఉన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్ల కాలంలో అనేకసార్లు జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు విషయంపై కేంద్ర సర్కారుకు విన్నవించింది. భూసేకరణ, ఆర్థిక వనరుల కల్పనపైనా భరోసా అందిం చింది. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ససేమిరా అనడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. చిగురించిన ఆశలపై నీళ్లు చల్లినట్లు అయ్యింది. ఎయిర్ స్ట్రిప్ వంటి కొంగొత్త ప్రతిపాదనలు తెరమీదకు తీసుకు వచ్చినప్పటికీ ప్రస్తుతం జక్రాన్‌పల్లిపై బీజేపీ సర్కారు కనీసం దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చొరవ తీసుకుని దశాబ్దాల ప్రతిపాదనను ముందుకు తీసుకు పోవాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

మినీ ఎయిర్‌పోర్టు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రయత్నం..

నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్‌పల్లి ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉన్నది. జాతీయ రహదారి 44కు ఆనుకొని ఉండ డంతోపాటు దగ్గరలోనే రైల్వే సదుపాయం కూడా ఉన్నది. రవాణా వ్యవస్థకు ఈ ప్రాంతం అత్యంత అనుకూలమైన ప్రదేశం. దీంతో ఉత్తర తెలంగాణ ప్రాంతవాసులకు జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుతో ఎంతో సౌలభ్యంగా ఉండే అవకా శాలు ఉన్నాయి. ఇక్కడ మినీ ఎయిర్‌పోర్టు నెలకొల్పితే ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. నిజామా బాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్లా, జగిత్యాల, కరీంనగర్, ఆదిలాబాద్, నిర్మల్, మెదక్ లాంటి జిల్లాలకు ఎంతో మేలు జరుగుతుంది. రోజురోజుకూ విమానయానం విస్తరిస్తున్నది. ఆకాశ మార్గాన ప్రయాణించే వారి సంఖ్యా పెరు గుతున్నది. పెరుగుతున్న జనాభా, ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పోర్టుల్లో రద్దీ దృష్ట్యా జక్రాన్‌పల్లి లాంటి ప్రాంతాల్లో మినీ ఎయిర్‌పోర్టు నెలకొల్పితే దేశీయ విమాన సర్వీసులకు ఎంతో మేలు జరుగనుంది. దీంతో ఉత్తర తెలంగాణ వాసులకు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండదు. పైగా రవాణా ఖర్చు కూడా తగ్గుతుంది. జక్రాన్‌పల్లిలో విమానాశ్రయమైతే శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు రద్దీ తగ్గే అవకాశం ఉన్నది. ప్రత్యక్ష, పరోక్ష లాభాలను దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీ ఆర్ హయాంలో జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు కోసం భారీగా ప్రయత్నాలు చేశారు. మామునూర్ ఎయిర్‌పోర్టుకు కేంద్ర విమానయాన శాఖ అనుమ తులు మంజూరు చేసినట్లే జక్రాన్‌పల్లికి సైతం మోక్షం ప్రసాదిస్తే బాగుండేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమ వుతున్నది.

అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవు

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు హెచ్చరిక

ప్రస్తుతం ఇదీ పరిస్థితి..

జక్రాన్‌పల్లి వద్ద దేశీయ విమాన సర్వీసుల కోసం, మినీ ఎయిర్‌పోర్టు నిర్మా ణానికి పదేండ్లలో అనేక చర్యలు తీసుకోవడంతోపాటు ఎయిర్‌పోర్ట్ అథా రిటీ ఆఫ్ ఇండియాతో నూ చర్చలు కూడా జరిగాయి. మినీ ఎయిర్‌పోర్టుకు రూ.328కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధ్య యనం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వానికి వివరాలు వెల్లడించింది. జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు కోసం 510 ఎకరాల భూమి అవసరమని తేల్చింది. అంతర్జా తీయ ఎయిర్‌పోర్టుకు రూ.348 కోట్లు, 740 ఎకరాల భూమి అవసర మని అధ్యయన నివేదికలో పొందుపర్చింది. జక్రాన్‌పల్లి వద్ద ప్రభుత్వ భూమి ఎక్కువగా ఉండగా.. భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వానికి ఎక్కువగా ఖర్చు అయ్యే అవకాశం కూడా లేదు. డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు జక్రాన్‌పల్లి అనుకూలంగా ఉండడంతో డిమాండ్‌ను అనుసరించి ముంబాయి, ఢిల్లీ, కలకత్తా, బెంగళూరు, చెన్నైకి సర్వీసులు నడిపేందుకు వీలు పడుతుందని ఎయిర్‌పోర్టు అథారిటీ సైతం భావించింది. కాని ఇంత వరకూ జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు అంశం ఎటూ తేలడం లేదు. దేశవ్యా ప్తంగా ఎడాపెడా ఎయిర్‌పోర్టులను మోడీ ప్రభుత్వం స్థాపిస్తుండగా తెలం గాణలో మాత్రం నామమాత్రంగా పౌర విమానయాన రంగాన్ని ప్రోత్సహి స్తుండడంపై జనాల్లో చర్చ నడుస్తున్నది. 2019, 2024లో వరుసగా బీజేపీ ఎంపీలే ఉత్తర తెలంగాణలో గెలిచారు. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో బీజేపీ ఎంపీలున్నప్పటికీ ఫలితం లేకుండా పోతున్నదని ఇక్కడి ప్రజలు నిరాశతో ఉన్నారు.

ఎయిర్‌పోర్టు ఏర్పాటైతే అభివృద్ధి..

జక్రాన్‌పల్లి, మార్చి 1 : జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటైతే ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని జక్రా న్‌పల్లిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురా వాలి. జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే ఉమ్మడి జిల్లా ప్రజలతోపాటు పక్కనే ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్ నుంచి విదేశాలకు వెళ్లే వారికి సౌకర్య వంతంగా ఉంటుంది. జక్రాన్‌పల్లిలో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ వహించాలి.

-అల్లూరి భాస్కర్‌రెడ్డి, జక్రాన్‌పల్లి

విదేశాలకు వెళ్లే వారికి సౌకర్యంగా..

జక్రాన్‌పల్లి, మార్చి 1 :ఇక్కడ ఎయిర్ పోర్టు ఏర్పాటైతే విదేశాలకు వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుంది. ఉమ్మడి నిజామా బాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో బతుకు దెరువు కోసం విదేశాలకు వెళ్లే వారు ఎక్కువగా ఉన్నారు. ముఖ్యంగా గల్ఫ్ కార్మి కులు అధికంగా ఉంటారు. జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే వారందరికీ సౌకర్యంగా ఉంటుంది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్రాన్ని ఒప్పించాలి.

-తలారి సతీశ్, జక్రాన్‌పల్లి

ఇసుక వాహనాలను అడ్డుకున్న వల్లభపూర్ గ్రామస్తులు

ఇసుక వాహనాల అడ్డగింత

- గంటపాటు నిలిపివేసిన వల్లభపూర్ గ్రామస్తులు
- ఇండ్లలోకి దుమ్ము వస్తున్నదని ఆవేదన

కోటగిరి, మార్చి 1: ఇసుక తరలి స్తున్న వాహనాలు వేగంగా వెళ్లడం తో ఇండ్లలోకి దుమ్ము వసున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ వల్లభపూర్ గ్రామస్తులు శనివారం వాటిని అడ్డుకున్నారు. లారీలు, టిప్పర్లలో ఓవర్ లోడ్‌తో ఇసుకను తరలి స్తుండడంతో రోడ్లు ధ్వంసం అవు తున్నాయ ని ఆగ్రహం వ్యక్తంచే శారు. మందర్నా మంజీరా నది నుంచి ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీలు, టిప్పర్లను గ్రామంలోకి రాగానే అడ్డగించారు. రోడ్డుపై దుమ్ము లేస్తున్నదని, దుమ్ము రాకుం డా చర్యలు తీసుకోవా లని, లేదంటే వాహనాలను నడవ నీయమని డ్రైవర్లను హెచ్చరిం చారు. ఈ విషయాన్ని డ్రైవర్లు నిర్వాహకులకు సమాచారం అందించారు. దీంతో నిర్వాహ కులు అక్కడికి చేరుకొని సమ స్యను తెలుసుకున్నారు. దుమ్ము రాకుండా ఉదయం, సాయంత్రం రెండు పూటలా రోడ్డుపై నీటిని పట్టాలని గ్రామస్తులు తెలిపారు. వెంటనే ట్యాం కర్ ద్వారా రోడ్డుపై నీటిని పట్టించారు. దీంతో గ్రామ స్తులు శాం తించి, వాహనాలకు అనుమతి ఇచ్చారు. సుమారు గంటపాటు నిరసన వ్యక్తంచేయ డంతో పెద్ద సంఖ్య లో వాహ నాలు నిలిచిపోయాయి.

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

రెండు గ్రామాల్లో ఇసుక డంపుల సీజ్

దాడులు నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ అధికారులు

మాచారెడ్డి,మార్చి 1 : మాచారెడ్డి మండలంలోని లక్ష్మీరావులపల్లి, పాల్వంచ మండలంలోని బండరా మేశ్వర్‌పల్లి గ్రామశివారులో ఉన్న భారీ ఇసుక డంపు లను రెవన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. 'వాగులనూ తోడేస్తున్నారు..' అనే శీర్షికన ప్రచురిం చిన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి కామారెడ్డి టాస్క్‌ఫోర్స్, రెవెన్యూ అధికారులు స్పందించారు. మండలంలోని ఇసుక డంప్‌లపై దాడి చేశారు. లక్ష్మీరావులపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 465లో పొలం వద్ద సుమారు 40 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. బండరామేశ్వ ర్‌పల్లి గ్రామ శివారులో 20 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంప్‌ను పాల్వంచ ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మణ్ సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక డంప్‌లకు 9వ తేదీన వేలం వేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

కదలని రెవెన్యూ అధికారులు..

కామారెడ్డి నుంచి ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ అధికా రులు వచ్చి మండలంలో ఇసుక డంపులను గుర్తి స్తున్నా.. స్థానిక రెవెన్యూ అధికారులు మాత్రం కార్యా లయం నుంచి కాలు కదపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడి అధికారులకు ఏ ప్రాంతంలో ఇసుక డంప్ చేశారో ఎందుకు తెలియడం లేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరిన్ని దాడులు నిర్వహిస్తే మండలంలోని వారు పరీవాహక ప్రాంతా ల్లోని గ్రామాల్లో మరిన్ని భారీ ఇసుక డంప్‌లు లభి స్తాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

వివరణ ఇచ్చేందుకు సిద్ధం..

మండలంలో ఉన్న ఇసుక డంపులపై వరుస కథనాలు వస్తున్నా.. రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. ఉన్నతాధికారులు ప్రశ్ని స్తే వివరణ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు కానీ గ్రామాల్లో తనిఖీలు చేపట్టడం లేదు. దాడిచేసి డంపులపై తనిఖీలు నిర్వహించడం లేదు. కలెక్టర్ స్పందించి ప్రత్యేకంగా విచా రణ అధికారిని నియమిస్తే మరిన్ని విష యాలు బయటికి వస్తాయని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

లక్ష్మీరావులపల్లి గ్రామ శివారులో ఉన్న ఇసుక డంపు

సాగునీటి సమస్య తలెత్తితే.. అధికారులదే బాధ్యత

బోధన్, మార్చి 12: జిల్లాలో ఎక్కడైనా సాగునీటి సమస్య తలెత్తితే.. సంబంధిత అధికారులదే బాధ్యత అని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. విధుల్లో అల సత్వం వీడాలని, సాగునీటి సరఫరాను పర్యవేక్షించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బోధన్ పట్టణంలోని నీటి పారుదలశాఖ గెస్ట్‌హౌస్‌లో బోధన్ సబ్ కలె క్టర్ వికాస్ మహతోతో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని పలు నీటి వనరుల కింద ఆయకట్టు పంటల పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి వనరులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులతోపాటు చెరువుల్లో గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం నీటి వనరులు అధికంగా ఉన్నాయని, ఎక్కడ కూడా సాగునీటి సమస్య ఏర్పడకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఆయకట్టు ఎగువ ప్రాంతాల్లో నీటి చౌర్యం జరుగకుండా చూడాలని, చివరి ఆయకట్టుకు సక్రమంగా నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పంటలకు సాగునీటి అవసరం ఎక్కువగా ఉన్నదని, నెలన్నర రోజులపాటు ప్రత్యేక దృష్టి సారించాలని మార్గదర్శనం చేశారు. గతేడాది జిల్లాలో 63వేల మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగించగా.. ఈసారి 77వేల మెట్రిక్ టన్నులకు డిమాండ్ పెరిగిందన్నారు. డిమాండ్‌ను దృష్టికి ఉంచుకొని తగినన్ని ఎరువులను తెప్పించి స్టాక్ చేసుకోవాలని వ్యవసాయా ధికారులకు సూచించారు. మున్సిపాలిటీల్లో వందశాతం ఆస్తిపన్ను వసూలు చేయాలని ఆ శాఖఅధికారులను ఆదేశించారు.

బోధన్‌లో సాగునీటి సమస్యపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

డిచ్‌పల్లి (ఇందల్‌వాయి), మార్చి 1: నీటి ఎద్దడి తీర్చాలని కోరుతూ ఇందల్‌వాయి మండలంలోని మెగ్యానాయక్ తండా మహి ళలు శనివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. తండాలోని దేవిగల్లీలో బోరు మోటరు చెడిపోవడంతో పది రోజులుగా తాము నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తంచే శారు. తాగడానికి నీరు లేక చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటు న్నామని తెలిపారు. నీటి సమస్యను పరిష్కరిం చాలని పలుమార్లు పంచాయతీ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే.. వేసవిలో ఎలా ఉంటుందోనని ఆందో శన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరుమోటరును రిపేరు చేయించి, నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తంచేస్తున్న మహిళలు

కత్తిపోట్ల కలకలం

- కామారెడ్డిలో పట్టపగలే భార్య హత్య
- ఆపై భర్త ఆత్మహత్యాయత్నం
- నవీపేట్ మండలంలో భార్యతో పాటు, అత్త, మామపై దాడి
- కుటుంబ కలహాలే కారణం

నవీపేట, మార్చి 1: కుటుంబ కల హాల నేపథ్యంలో ఓ వ్యక్తి భార్యతో పాటు అత్త, మామపై దాడి చేశాడు. నవీపేట్ మండలంలో శనివారం చోటు చేసుకున్న కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. ఎస్సై వినయ్ కథనం ప్రకారం.. నవీపేట మండల కేంద్రంలోని లింగం గుట్టకు చెందిన మిథున్, అభంగపట్నం గ్రామానికి చెందిన జ్యోతి గతంలో ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. అయితే, సంసార జీవితంలో మనస్పర్థలు రావడంతో జ్యోతి మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబంపై మిథున్ కక్ష పెంచుకున్నాడు. శని వారం పని మీద నవీపేటకు వచ్చిన మామ మహారాజుపై తాగిన మైకంలో బండరాయితో దాడి చేశాడు. గాయపడిన మహారాజును స్థానికులు నవీపేట ప్రభుత్వ దవా ఖానకు తరలించారు. విషయం తెలిసి జ్యోతితో పాటు ఆమె తల్లి శోభ దవాఖానకు చేరుకున్నారు. అప్పటికి అక్కడే ఉన్న అల్లుడిని ఎందుకు దాడి చేశావని అత్త నిలదీ యడంతో కోపోద్రిక్తుడైన మిథున్ తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడికి పాల్పడ్డాడు. భార్య అడ్డుపడగా ఆమెపైనా దాడి చేసి గాయపరి చాడు. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహేశ్వరి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కామారెడ్డి, మార్చి 1: భర్త చేతిలో భార్య దారుణ హత్యకు గురైన ఘటన కామారెడ్డి పట్టణంలో శనివారం చోటుచేసుకున్నది. వేద మంత్రాల సాక్షిగా ఏడడుగులు నడి చి.. కలకాలం కలిసి ఉంటానని బాస చేసి న భర్తే.. ఆమె పాలిట యముడయ్యాడు. పట్టపగలే భార్యను దారుణంగా పొడిచి హత్యచేశాడు. అనంతరం తానూ పొడుచుకొని ఆత్మహత్యాయ త్నానికి పాల్పడ్డాడు. కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌర స్తా ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మోసారపు మహేశ్వరి(45), నర్సింహులు దంపతులు కామారెడ్డి పట్ట ణంలోని ఆర్బీనగర్‌లో నివసిస్తున్నారు. మహేశ్వరి ఓ హోటల్‌లో పని చేస్తుండగా.. నర్సింహులు నిజాంసాగర్ చౌరస్తాలోని సులభ్ కాంప్లె క్స్‌లో పనిచేస్తున్నాడు. కాగా ఇరువురి మధ్య డబ్బుల విషయంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. శనివారం కూడా దంపతుల మధ్య డబ్బుల విషయంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో క్షణికావేశంలో నర్సింహులు తన వెంట తెచ్చుకున్న కత్తితో భార్యను విచక్షణా రహి తంగా పొడిచాడు. తీవ్ర రక్తస్రావమైన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అనంతరం అదే కత్తితో నర్సింహులు కడుపులో పొడుచుకొని ఆత్మహ త్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని కామా రెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండ డంతో నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని ఏఎస్పీ చైతన్యారెడ్డి, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ శానిటరీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మహేశ్వరి మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలోని మార్చురీకి తరలించామన్నారు.

గోదావరి జలకళ

మోర్తాడ్, మార్చి 1: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి శనివారం 0.6 టీఎంసీల నీటిని అధికారులు దిగువకు విడు దల చేయడంతో గోదావరి జలకళ వచ్చింది. తాగు నీటి అవసరాల కోసం ఏటా మార్చి 1వ తేదీన 0.6 టీఎంసీల నీటిని విడుదల చేయాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగానే శనివారం 0.6 టీఎంసీల నీటి విడుదల పూర్తవ్వగానే ప్రాజెక్టు గేట్లను మూసి వేశారు. యూజీడీ హైదరాబాద్ ఈఈ వెంకటేశ్వర్లు, ఎస్సా రెస్పీ ఈఈ చక్రపాణి, నాందేడ్ డీఈ ప్రశాంత్ కదం, ఎస్సారెస్పీ ఏఈఈ రవి కొత్త, బాబ్లీ ప్రాజెక్టు జేఈ సచిన్ దేవ్‌కాంబ్లే, ఎస్సారెస్పీ ఏఈఈలు విన్యాస్, సుశాంత్ పాల్గొన్నారు.